
సాక్షి
బాపట్ల

గురువారం । 29 । ఆగస్టు । 2024



వాసవీ మాతకు వజ్రాల వడ్డాణం

కారెంపూడి: శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారికి వజ్రాలు పొదిగిన బంగారు వడ్డాణాన్ని వ్యాపారవేత్త ఏచూరి మణిదీప్ దంపతులు బుధవారం బహూకరించారు.



సాగు నీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 7508 క్యూసెక్కులు విడుదల చేశారు.

నిదానంపాటి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట



పిట్టలవానిపాలెం: గోకరాజునల్లి బోయినవారిపాలెం శివారు దివాన్ తోట గ్రామంలో కొలువై ఉన్న నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి విగ్రహప్రతిష్ట కార్యక్రమాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఖైదీలకు మెరుగైన వసతులు

జైళ్ల శాఖ జిల్లా అధికారి వీరేంద్రప్రసాద్

రేపల్లె రూరల్: జైళ్లలో రిమాండ్‌లో ఉన్న ఖైదీలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని జైళ్లశాఖ జిల్లా అధికారి ఆర్.వీరేంద్రప్రసాద్ తెలిపారు. రేపల్లె సబ్‌జైలును బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి అనంతరం మాట్లాడారు. తెనాలి జైలు రీమోడల్ చేస్తున్న నేపథ్యంలో అక్కడి ఖైదీలను రేపల్లె, బాపట్ల సబ్‌జైలుకు తరలించామన్నారు. రిమాండ్‌లో ఉన్న ఖైదీలలో సత్ప్రవర్తన వచ్చేలా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, యోగా వంటివి నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సబ్‌జైలులోని పరిసరాలను పరిశీలించి ఖైదీలతో మాట్లాడారు. ఆయన వెంట సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

ఆలయ ముఖ ద్వారం ప్రారంభం



మంగళగిరి : పట్టణంలోని గౌతమ బుద్ధా రోడ్డులో గల శ్రీ లక్ష్మీనృసింహస్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్మించిన ముఖ ద్వారాన్ని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దాతలు ముందుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఈవో ఏ. రామకోటిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆలీంబాషా, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు, టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు,దామర్ల రాజు, సంకా బాలాజీ గుప్తా, నందం అబద్ధయ్య, వింజమూరి ఆషాబాల పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు కూల్చివేత



తెనాలి అర్బన్: వాహబ్ చౌక్‌లో అక్రమంగా నిర్మించిన గదిని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం కూల్చి వేశారు. వాహబ్‌చౌక్‌లో షేక్ జిలానీ తన పాత భవనంపై మరో గదిని నిర్మించాడు. దానికి మున్సిపల్ అనుమతులు లేవు. ఫిర్యాదులు కూడా రావడంతో దాన్ని కూల్చివేసినట్లు అసిస్టెంట్ సిటీ ప్లానర్ జెడ్. సుధాకర్ తెలిపారు.

వైభవంగా శిఖర ప్రతిష్ట



తెనాలి రూరల్: ప్రసిద్ధి శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత వెంకటేశ్వరస్వామి వారి వైకుంఠపురం దేవస్థానంలో బుధవారం కళాన్యాస పూర్వక శిఖర ప్రతిష్ట, మహా సంప్రోక్షణ ఘనంగా నిర్వహించారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు బుధవారం ఉదయం 7:45 గంటలకు శిఖర ప్రతిష్ట జరిపారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 11గంటలకు ఉత్సవమూర్తులకు విశేష పూజ, కుంభ, గో, ధాన్య, కన్యాదర్శనం, మహాహారతి నిర్వహించారు. అనంతరం మహా సంప్రోక్షణ, మహా పూర్ణాహుతి, శ్రీ హనుమత్ లక్ష్మణ సీతారామస్వామి, శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ రుక్మిణి సమేత శ్రీ కృష్ణ స్వామి శాంతి కల్యాణాలను కనుల పండువగా జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆలయ సహాయ కమిషనర్ ఎం. తిమ్మానాయుడు, పాలక మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, సభ్యులు పాల్గొన్నారు.

రెండవ రోజూ తెలుగులో..

తెనాలి రూరల్: తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పవన్‌కుమార్ వరుసగా రెండో రోజు తీర్పును తెలుగులో చెప్పారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ వారం రోజుకో తీర్పును తెలుగులో చెప్పాలని న్యాయమూర్తి నిర్ణయించారు. ఈ మేరకు ఓఎస్ నంబరు 128/2024 కేసు బుధవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన ఆయన తీర్పును తెలుగులో చెప్పారు.



వైద్యులకే రక్షణ లేకుండా పోతోంది

ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు వైద్యులు నిరంతరం శ్రమిస్తున్నాం. ప్రాణాలు రక్షించే వైద్యులను దైవసమానులుగా పోల్చుతారు. అయితే నేడు వైద్యుల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోంది. మహిళా వైద్యుల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినమైన చట్టాలు చేసి పటిష్టంగా అమలుపరచాలి. అప్పుడే వైద్యులు తమ విధులను స్వేచ్ఛగా నిర్వహించ గలుగుతారు. - డాక్టర్ శరణ్య, మొల్లగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రేపల్లె



కఠిన శిక్షలు విధించాలి



కోల్‌కతా ఘటన దేశ ప్రజల మనస్సును కలచి వేసింది. వైద్యులపై దాడులకు పాల్పడే వారికి కఠిన శిక్షలు విధించేలా చట్టాలు చేయాలి. దాడులు చేసే వారిలో ఆల్కహాల్, మత్తుపదార్థాలు వాడే వారే ఎక్కువ మంది ఉంటున్నారు. యువత మత్తు పదార్థాల బారిన పడకుండా చూడాల్సిన ఆవశ్యకత తల్లిదండ్రులపై ఎంతైనా ఉంది.

-జె.స్వరూపరాణి, ఏఎన్‌ఎం, భట్టిప్రోలు పీహెచ్‌సీ

అమ్మభాషకు ఆదరువు

గిడుగు పోరాట ఫలితమే తెలుగుకు వైభవం

- వ్యవహారిక భాషోద్యమకారుడు గిడుగు రామమూర్తి పంతులు
- తెలుగు భాషా దినోత్సవంగా గిడుగు రామమూర్తి జయంతి
- తెలుగు సాహిత్యం పుట్టినిల్లు బాపట్ల
- తెలుగు పద్యం పుట్టింది ఇక్కడే
- భాషాప్రయుక్త రాష్ట్రవాదనకు బీజం ఇక్కడే
- నేడు తెలుగు భాషా దినోత్సవం

అమ్మభాష అమృతం వంటిది.. చంకనెత్తుకుని గోరుముద్దలు తినిపిస్తూ అమ్మపాడే పాటలు.. భుజానకెత్తుకుంటూ ముద్దు చేస్తూ నాన్న పలికే మాటలు.. బామ్మలు చెప్పే ఊసులు.. వింటూ శిశువు భాషా శిక్షణ ప్రారంభమవుతుంది. ఖండాతరాల్లో ఉన్నా.. బహుభాషా కోవిదుడైనా మాతృభాష చెవినపడగానే తెలియని ఆనందానుభూతికి లోనవుతాడు. అదే మాతృభాషలోని మాధుర్యం. గ్రాంధికంగా ఆకాశమార్గాన పయనించే మన మాతృ భాష తెలుగును భూమార్గం పట్టించిన మహోన్నతుడు గిడుగు రామమూర్తి పంతులు. నేడు తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



సాక్షి ప్రతినిధి,బాపట్ల: తెలుగు భాషాభివృద్ధికి గిడుగురామమూర్తి చేసిన సేవ ఎనలేనిది, మరువరానిది. ఆయన తెచ్చిపెట్టిన తెలుగుభాషాభివృద్ధికి ప్రతి తెలుగువ్యక్తి పాటుపడాల్సిన అవసరముంది. గిడుగు రామ్మూర్తి పంతులు గొప్ప రచయిత, బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు, సంఘసంస్కర్త, హేతువాది, అన్నింటికి మించి ఆంధ్రదేశంలో వ్యవహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. ఆయన ఉద్యమంవల్లే నేడు మనం మాట్లాడుకుంటున్న తెలుగు, పత్రికల్లోనూ, పాఠ్యాంశాల్లోను చోటు దక్కించుకుంది. తెలుగు గిరిజనుల సవర భాషకు లిపిని కనుగొన్నారు. ఆయన కృషికి గుర్తింపుగా ప్రభుత్వం గిడుగు రామమూర్తి జయంతి ఆగస్టు 29ని తెలుగుభాషా దినోత్సవంగా జరుపుతోంది.

తొలి తెలుగు పద్యశాసనం ఇక్కడే..

తెలుగులోని మొట్ట మొదటి పద్య శాసనం క్రీ.శ. 848లో బాపట్ల జిల్లా అద్దంకిలోనే లభ్యంకాగా రెండవది 849లో కందుకూరులో, మూడవది 855లో ధర్మవరంలో లభ్యమయ్యాయి. ఆంధ్ర మహాభారతాన్ని రచియించిన కవిత్రయంలో ఒకరయిన ఎఱ్ఱాప్రగడ బాపట్ల జిల్లావాడే. ఎఱ్ఱాప్రగడ అద్దంకి రెడ్డి రాజుల ఆస్థాన కవిగా ఉన్నాడు. భారత అరణ్యపర్వ శేషం, హరివంశం, రామాయణం, నృసింహపురాణం వంటి కతులను ఎన్నింటినో ఆయన రచించాడు. మహాకవి శ్రీనాథుడు బాపట్ల జిల్లాలో నడయాడాడు. ఆయన రెడ్డిరాజుల ఆస్థాన విద్యాధికారిగా వెలుగొందాడు. శృంగారనైషధం, హరవిలాసం, పల్నాటి వీర చరిత్ర, కాశీఖండము, పండితారాధ్య చరిత్ర, క్రీడాభిరామము వంటి ఎన్నో కతులు రచించి కవిసార్వభౌముడిగా ఖ్యాతికెక్కాడు.

తెలుగు భాషను సుసంపన్నం చేసిన కవులు...

బాపట్లకు చెందిన అనేకమంది సాహితీ మూర్తులు తెలుగు సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. మహాకవి రాయప్రోలు సుబ్బారావు తెలుగు పద్య సాహిత్యాన్ని పరిపుష్టం చేసి, 'తెలుగులెంక'గా కీర్తించబడ్డారు. తుమ్మల సీతారామమూర్తి ఆంధ్ర వాఙ్మయ చరిత్రలో లేఖా సాహిత్యానికి శ్రీకారం చుట్టారు కనుపర్తి వరలక్ష్మమ్మ తెలుగు సరస్వతికి అనేక కతులు సమర్పించి 'ఆంధ్ర సరస్వతి' గా పేరుగాంచారు. ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, జానపద కవిసార్వభౌముడిగా ఖ్యాతికెక్కిన కొసరాజు రాఘవయ్య చౌదరి తెలుగు సినిమా సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. ఇంకా అద్దంకి గంగాధర కవి, నారాయణతీర్థులు కూడా బాపట్ల జిల్లాకు చెందినవారే. ఆధునిక సాహిత్యంలోనూ బాపట్ల జిల్లాకు చెందిన అనేకులు కీర్తి ప్రతిష్టలు పొందారు.

భాషా వికాసంలో బాపట్ల ప్రధాన పాత్ర

తెలుగు భాషా వికాసంలో బాపట్ల ప్రధాన పాత్రను పోషించింది. నిజానికి తెలుగు సాహిత్యం బాపట్లలోనే ఓనమాలు దిద్దుకొంది. తెలుగు పద్యం బాపట్ల గడ్డమీదే పుట్టింది. బాపట్ల కవులు ఎందరో తెలుగు భాషను సుసంపన్నం చేశారు. తెలుగు భాషకు పట్టం కట్టిందికూడా బాపట్లే. భాషాప్రయుక్త రాష్ట్ర వాదనకు ఇక్కడే బీజం పడింది. 1913లో బాపట్లలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభ తెలుగువారి స్వరాష్ట్ర వాంఛను బలంగా వినిపించింది.



బాపట్లలోని తెలుగు తల్లి విగ్రహం

తెలుగుసాహిత్యం పుట్టినిల్లు బాపట్ల



తెలుగుసాహిత్యానికి బాపట్ల పుట్టినిల్లుగా స్థానం పొందింది. ఆధునిక సాహిత్యంలోనూ బాపట్ల జిల్లాకు చెందిన అనేకులు కీర్తి ప్రతిష్టలు పొందారు. భాషా ప్రయుక్త రాష్ట్ర వాదనకు ఇక్కడే బీజం పడింది. గిడుగు రామమూర్తి పంతులు స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తెలుగు భాషాభివృద్ధికి కృషిచేయాలి.

– సాయిబాబా, ఫోరంఫర్ బెటర్ బాపట్ల


తెలుగుభాష అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



గిడుగు రామమూర్తి పంతులు గొప్ప రచయిత. ఆంధ్రదేశంలో వ్యవహారిక భాషోద్యమానికి మూల పురుషుడు. బహుభాషా శాస్త్రవేత్త, చరిత్రకారుడు. వాడుక భాష ఉద్యమం చేపట్టినందుకు పండితులతో యుద్ధం చేయవలసి వచ్చింది. అయినా వెరవలేదు. వ్యవహారిక భాష కోసం అహర్నిశలు పోరాడారు. మన మాతృభాష తెలుగు. ప్రతి ఒక్కరూ తెలుగులోనే మాట్లాడాలి. తెలుగులోనే కార్యకలాపాలు జరపాలి.

– చెన్నుపాటి రామాంజనేయులు, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు

గిడుగు స్ఫూర్తితో తెలుగు భాషాభివృద్ధి



గిడుగు రామమూర్తి వ్యవహారిక తెలుగు భాష అమలు కోసం పెద్ద ఉద్యమాన్ని నడిపిన మహోన్నత వ్యక్తి. రచయిత, చరిత్రకారుడు. గిరిజనుల సవరభాషకు లిపి కల్పించిన వ్యక్తి. ఆయనవల్లే గ్రాంధికం పోయి వాడుకభాష తెలుగు అమలులోకి వచ్చింది. ఆయన ఉద్యమంతోనే ప్రభుత్వం వాడుక తెలుగుభాషను పాఠ్యాంశాలుగా తీసుకువచ్చింది. గిడుగు రామమూర్తి జయంతిని ప్రభుత్వం తెలుగు భాషాదినోత్సవంగా జరుపుతోంది. ప్రతి ఒక్కరూ తెలుగుభాష అభివృద్ధికి కృషిచేయాలి.

-విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రచయిత, అద్దంకి

ఇదేం జ్వరంరా బాబోయ్!

రోగం రెండు రోజులే.. బాధలు మాత్రం రెండు వారాలపైనే

- శరీరంపై మచ్చలు, దద్దుర్లు
- పడిపోతున్న ప్లేట్‌లెట్లు
- రోగులతో నిండిపోతున్న ఆస్పత్రులు

చీరాల: గతంలో జ్వరం వచ్చిందంటే వారం రోజులు ఉండి మందులతో క్రమక్రమంగా తగ్గిపోయేది. సీజనల్ జ్వరాలు కూడా కొద్దిరోజుల్లో తగ్గిపోయేవి. కానీ ప్రస్తుతం వస్తున్న జ్వరాలు కొంత డిఫరెంట్‌గా ఉన్నాయి. జ్వరం ఉండేది రెండు రోజులే అయినా జ్వరం తగ్గిన కొద్ది రోజులు వరకు శరీర బాధలు ఎక్కువగా వస్తున్నాయి. పరీక్ష చేస్తే సాధారణ జ్వరంగా తేలుతోంది. మలేరియా, డెంగీ ఎస్‌ఎస్-1తో పాటు ప్రస్తుతం రకరకాల జ్వరాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. రోగికి వచ్చింది ఏజ్వరమో వైద్యులకు సైతం అంతుపట్టని పరిస్థితి ఉంది. జనం మాత్రం జ్వరం వచ్చిందంటే మలేరియా, డెంగీ వచ్చిందంటూ హాస్పిటల్స్‌కు పరుగులు తీస్తున్నారు. జ్వరం ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోయినా ఆ తర్వాత కాళ్ల వాపులు, శరీరంపై ర్యాష్ వస్తుంది. ప్రస్తుతం వస్తున్న జ్వరాలు ఒకటి రెండు రోజులు ఉంటుంది. 103 నుంచి 104 డిగ్రీల సెల్సియస్ వరకూ నమోదవుతుంది. కానీ జ్వరం వలన వచ్చే దుష్ఫలితాలు మాత్రం రెండు వారాలకు పైగా ఉంటున్నాయి.

మలేరియా, డెంగీ అనుమానిత కేసులే ఎక్కువ..

జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో జ్వరపీడితుల సంఖ్య అధికంగా ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యశాలల్లో జ్వరాల కేసులు అధికంగా ఉంటున్నాయి. సీజనల్ వ్యాధులుతో సహా ఎక్కువగా మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు అంతా జ్వరాల బారిన పడుతున్నారు. ఉదయం, రాత్రిళ్ల దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండటంతో ప్రజలు జ్వరాలతో మంచం పడుతున్నారు. చీరాల ఏరియా వైద్యశాలలో 112 మంది ఇన్‌ఫెక్షెంట్ జ్వరాల బారిన పడ్డ వారిలో ఎక్కువగా ప్లేట్‌లెట్స్ తగ్గిపోతున్నాయి. ఎలీసా పరీక్ష చేస్తే నెగెటివ్ వస్తున్నా జ్వరం మాత్రం తగ్గడం లేదు. దోమకాటుతో పాటు వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా కూడా జ్వరాల బారిన పడుతున్నారు. శరీరంపై దురదలు, ర్యాష్‌లు వస్తున్నాయి. కొద్దిరోజులుకు అవి కూడా తగ్గిపోతున్నాయి.



చీరాల ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులు

డ్రైడే..ఫ్రైడేకు మంగళం

గ్రామీణ, శివారు ప్రాంతాల్లో దోమల వ్యాప్తి అధికంగా ఉంది. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు దోమల నివారణ చర్యలు మాత్రం శూన్యం. ప్రచారాలకే అన్నట్లుగా దోమల నివారణ కార్యక్రమాలు సాగుతున్నాయి. అనుమానిత కేసులు వచ్చిన ప్రాంతంలో మాత్రం వైద్యశాఖ, మున్సిపల్ అధికారులు వెళ్లి ఇళ్లలో యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమాలను నిర్వహించి చేతులు దులుపుకొంటున్నారు. దోమల నివారణ కార్యక్రమం క్షేత్ర స్థాయిలో జరగడంలేదు. జ్వరాలతో ప్రజలు హాస్పిటళ్లకు క్యూ కడుతున్నారు.

ఇవీ లక్షణాలు..

- జ్వరం వచ్చిన ఒకటి రెండు రోజుల్లో తగ్గిపోతుంది. ఆ తర్వాత తీవ్రమైన తలనొప్పి, ఒళ్లు నొప్పులు వస్తున్నాయి.
- కీళ్ల నొప్పులు, కాళ్ల వాపులు అధికమవుతాయి. కొందరిలో మంచం మీద నుంచి కిందకు దిగి నడవలేని పరిస్థితి వస్తుంది.
- వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. పది నుంచి పదిహేను రోజులు పాటు ఈ లక్షణాలు కనిపిస్తున్నాయి.
- కొందరిలో జ్వరం తక్కువగా ఉండి గొంతు నొప్పి వస్తుంది. నీరసించిపోయి రెండు మూడు రోజుల పాటు దగ్గు కూడా వస్తుంది.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు చేయండి

జిల్లా అధికారులతో పల్నాడు కలెక్టర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు

నరసరావుపేట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌ల జిల్లా పర్యటన కోసం ఏర్పాట్లు పటిష్ఠంగా చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా కోటి మొక్కలు నాటే వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు వారు ఈ నెల 30వ తేదీన జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో పి.అరుణ్‌బాబు సమీక్షా సమావేశం నిర్వహించారు. కాకాని జేఎన్‌టీయూఎన్ క్యాంపస్‌లో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి అవసరమైన మొక్కలను సిద్ధంగా ఉంచాలని అధికారులకు ఆయన సూచించారు. దీంతోపాటు జిల్లావ్యాప్తంగా గ్రామాలు, మున్సిపాలిటీలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర చోట్ల ఏకకాలంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మొక్కలు సకాలంలో సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో పాల్గొనే వారికి తాగునీరు వసతి కల్పన, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్వో కె.వినాయకం, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

నరసరావుపేట రూరల్: జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో సీఎం, డిప్యూటీ సీఎంల పర్యటనకు చేస్తున్న ఏర్పాట్లను బుధవారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుతో కలిసి కలెక్టర్ పి.అరుణ్‌బాబు పరిశీలించారు. వన మహోత్సవం జరిగే ప్రాంతంతోపాటు హెలిప్యాడ్, సభాస్థలి, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలపై జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సమీక్ష

బాపట్ల: ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖల పనితీరుపై సంబంధిత అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభా నైపుణ్యాలకు అధికారులు మెరుగులు దిద్దాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో వసతి పొందుతూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల సంక్షేమంపై దృష్టి సారించాలన్నారు. మెనూ పక్కాగా అమలు కావాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని ఆదేశించారు. ఎస్సీ సంక్షేమ శాఖ వసతిగృహాలు జిల్లాలో 27 ఉండగా 1,581 మంది విద్యార్థులు మాత్రమే వసతి పొందుతున్నారని, 1,319 సీట్లు ఖాళీగా ఉండడం ఏంటని అధికారులను నిలదీశారు. అలాగే బీసీ సంక్షేమ వసతి గృహాల్లో 3,284 సీట్లు ఖాళీగా ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె.రాజా దిబోర, బీసీ సంక్షేమ శాఖ అధికారి శివలీల, గిరిజన సంక్షేమశాఖ అధికారి దూర్జటి, విభిన్న ప్రతిభావంతులశాఖ అధికారి అర్చన, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

వలసల నిరోధంపై దృష్టిపెట్టండి..

వలసలు నివారిస్తూ ఉపాధి హామీ పథకం ద్వారా నిరుపేదలకు అధికారులు ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. ఉపాధి హామీ పథకం అమలు తీరుపై ఎంపీడీవోలు, డ్వామా అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని వీసీ హాల్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉపాధి హామీ పథకంలో దొంగ మస్టర్లకు అవకాశం లేకుండా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. ప్రస్తుతం 33 రోజులు పనిదినాలు కల్పిస్తుండగా, కనీసం వందరోజులు పని దినాలు కల్పించడమే అధికారులకు లక్ష్యం కావాలన్నారు. తీర ప్రాంతాలలో బీచ్‌ల వద్ద విస్తృతంగా పండ్ల మొక్కలు నాటాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి చెప్పారు. జిల్లాలో 4,440 ఎకరాలలో ఉద్యాన పంటలు వేయాలని లక్ష్యంగా ఉందన్నారు. జిల్లాలో 4.68 లక్షల మందికి జాబ్ కార్డులు ఉన్నాయని, మరో 84 వేల మందికి జాబ్ కార్డులు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. డ్వామా పీడీ రాజేష్, నిర్మాణ శాఖ పీడీ ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి, ఎంపీడీవోలు, ఏపీఓలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై దాడులతో సామాజిక నష్టం



వైద్య సిబ్బందిపై పైశాచికత్వంతో చేస్తున్న దాడులు, అరాచక చర్యల వల్ల వైద్య సిబ్బందికి వ్యక్తిగత నష్టం వాటిల్లడమే కాకుండా సమాజానికి నష్టం వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. వైద్య సిబ్బందిపై దాడులు, అత్యాచారాలు, హత్యల వంటి ఘటనలకు పాల్పడకుండా అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. ప్రభుత్వాలు సైతం అటువంటి ఘటనలకు పాల్పడిన వ్యక్తులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు, ఆపదలో ఉన్నవారిని సత్వరం ఆదుకునేలా పటిష్టమైన రక్షణ ఏర్పాట్లు చేయాలి.

– జి. రాణి రత్నప్రభ, ఫార్మాసిస్ట్, పీహెచ్‌సీ కొల్లూరు.



ఫిర్యాదుల విభాగం ఏర్పాటు చేయాలి

వైద్యరంగంలో అధిక శాతం మహిళలే పనిచేస్తున్నందున వారు పనిచేసే చోట తోటి ఉద్యోగులతోపాటు, వైద్యసేవలు పొందడానికి వచ్చిన వ్యక్తుల నుంచి లైంగిక వేధింపులు, దాడులకు గురవుతున్నారు. వీటిని అరికట్టడానికి ప్రభుత్వం ప్రతి వైద్యశాలలో సిబ్బంది తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలియజేసే విధంగా ఫిర్యాదుల బాక్సులను ఏర్పాటు చేసి వాటిలో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే విచారణ చేసి సత్వర చర్యలు చేపట్టాలి. వైద్యసేవలు అందించే సిబ్బందిపై ఎటువంటి అకృత్యాలు జరగకుండా కఠిన శిక్షలను అమలు చేయాలి.

– తోడేటి సంధ్యారాణి, ఏఎస్ఎం, కొల్లూరు సచివాలయం–1



క్లుప్తంగా

ఎమ్మెల్సీ పోతుల సునీత రాజీనామా



చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ, రాష్ట్ర పార్టీ మహిళా అధ్యక్షురాలిగా ఉన్న పోతుల సునీత వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు బుధవారం ఆమె ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తనకు మంచి ప్రాధాన్యత కల్పించారని, తన వ్యక్తిగత కారణాలతో పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ కార్యాచరణ త్వరలో ప్రకటిస్తానన్నారు.

కొండచిలువ పట్టివేత




మార్టూరు: ఇళ్ల సమీపంలో ఉన్న పది అడుగుల కొండచిలువను అధికారులు పట్టుకుని అడవిలో వదిలిపెట్టారు. కూకట్లపల్లి ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రమేష్ కథనం మేరకు.. మండలంలోని కోలలపూడి, తాటివారిపాలెం గ్రామాల మధ్య నివాసాల సమీపంలో బుధవారం కొండచిలువను స్థానికులు గుర్తించి సమాచారం అందించారు. ఫారెస్ట్ అధికారులు రమేష్, శ్రీనివాసరావు అక్కడికి చేరుకున్నారు. ఓ కోడిని తిని కదలలేని స్థితిలో ఉన్న కొండచిలువను బంధించారు. నాగరాజుపల్లి గ్రామ పరిధిలోని కొండపై అటవీ ప్రాంతంలో వదిలివేశారు. అధికారి రమేష్ మాట్లాడుతూ.. అడవులు, కొండల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న నేపథ్యంలో వన్యప్రాణులు ఇళ్ల మధ్యకు వస్తున్నాయని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని గుర్తుచేశారు.

సెప్టెంబర్ 1న పెన్షన్ స్కీంకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శన

గుంటూరు ఎడ్యుకేషన్: కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులపై బలవంతంగా రుద్దనున్న యూనిఫైడ్ సర్వీస్ పెన్షన్(యూపీఎస్)కు వ్యతిరేకంగా సెప్టెంబర్ ఒకటిన నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీపీఎస్ తరహాలో యూపీఎస్‌ను వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి 50 శాతం పెన్షన్‌తో అమలు చేస్తామని చెప్పడం లక్షలాది కేంద్ర ఉద్యోగ, ఉపాధ్యాయులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. జీపీఎస్ అయినా, యూపీఎస్ అయినా ఉద్యోగి కాంట్రిబ్యూషన్ లేకుండా లేదన్నారు. ఉద్యోగి తన జీతం నుంచి ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేని పాత పెన్షన్ విధానాన్ని(ఓపీఎస్) అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ అసంబద్ధ సంక్షేమ విధానాలకు వ్యతిరేకంగా సెప్టెంబర్ ఒకటిన గుంటూరు, పొన్నూరు, తెనాలి, మంగళగిరి తాలుకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు చేపడతామని తెలిపారు. నిరసన ప్రదర్శనలను ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆడాలని ఉంది.. సహకారం కావాలి!

- క్రీడా స్టేడియాల పై ప్రభుత్వ నిర్లక్ష్యం
- క్రీడలపై రాజకీయ క్రీనీడలు
- నేడు జాతీయ క్రీడా దినోత్సవం



ధ్యాన్‌చంద్ (ఫైల్)

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : హాకీకి పర్యాయ పదంగా మారిన ధ్యాన్‌చంద్ జన్మదినం ఆగస్ట్ 29న ప్రతి ఏటా 'జాతీయ క్రీడా దినోత్సవం' గా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఇంతటి మహోన్నత వ్యక్తికి ఇప్పటికీ భారతరత్న ఇవ్వలేదు. అయితే ఇటీవల రాజీవ్ ఖేల్‌రత్న అవార్డును ధ్యాన్ చంద్ ఖేల్‌రత్న అవార్డుగా మార్పు చేశారు.

ప్రతి మనిషి జీవితంలోనూ క్రీడలు ఒక భాగం కావాలని నిత్యం వింటుంటాం. ఆధునిక ప్రపంచంలో వ్యాయామానికి పెద్దపీట వేస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న అపార్ట్‌మెంట్స్, మాల్స్‌లో సైతం క్రీడా, వ్యాయామానికి ప్రాధాన్యత కల్పిస్తున్నారు. నేడు క్రీడా సాధన చేయని ప్రపంచం ఉండదంటే అతిశయోక్తికాదు. హరియాణా, తమిళనాడులాంటి రాష్ట్రాల్లో క్రీడాకారులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యతనిస్తున్నారు. అయితే, మన రాష్ట్రంలో ఇప్పటికీ క్రీడా పాలసీ లేకపోవడం దారుణం. 2004లో అప్పటి మహానేత డాక్టర్ వైఎస్. రాజశేఖరరెడ్డి గ్రామాల్లో సైతం క్రీడలు అభివృద్ధి చెందాలనే సంకల్పంతో (పైకా) పంచాయితీ క్రీడా, ఖేల్ ఖేల్ అభియాన్ పథకం తీసుకొచ్చి ప్రతి గ్రామానికి రూ.2 లక్షల వరకు నిధులు సమకూర్చారు. ఆ తర్వాత అంటే 2019–24 మధ్యకాలంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి స్టేడియం అభివృద్ధితో పాటు ' ఆడుదాం ఆంధ్ర' పేరుతో రాష్ట్రంలో క్రీడా పండుగ నిర్వహించడంతో అనేక మంది గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వచ్చారు. జాతీయ, అంతర్జాతీయ పతకాలు సాధించిన వారికి లక్షల రూపాయల నగదు బహుమతులతో ప్రోత్సహించారు. ప్రస్తుతం జాతీయ క్రీడైన హాకీకి స్టేడియం లేకపోవడం దురదృష్టకరం. నేడు 'జాతీయ క్రీడా దినోత్సవం' . ఈ క్రమంలో నగరంలో ఉన్న క్రీడా సాకర్యాలు, విధానాలపై కొన్ని వివరాలు ..

అప్పటి ప్రగతి ఎక్కడ ?

2019–24లో అద్భుత ప్రగతి సాధించింది. ముఖ్యంగా ప్రభుత్వం బీఆర్ స్టేడియం కోసం రూ.50 కోట్లు వెచ్చించి క్రికెట్ స్టేడియంతోపాటు బాస్కెట్ బాల్, టెన్నిస్, రన్నింగ్ ట్రాక్ తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. శాసన మండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియంలో అభివృద్ధి శరవేగంగా జరిగిందంటే అతిశయోక్తికాదు. ఈ క్రమంలో ఆయనకు స్టేడియం సభ్యులు బ్రహ్మరథం పట్టారు. అప్పిరెడ్డి ఆధ్వర్యంలో అత్యాధునిక బాస్కెట్ బాల్ కోర్ట్, ఆధునిక జిమ్, ఓపెన్ జిమ్, వాకింగ్ ట్రాక్ మరమ్మతులు, స్టేడియంలో మొక్కలు నాటడం, నూతన మరుగుదొడ్ల నిర్మాణం.. ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చిత్తశుద్ధితో చేశారు. పట్టణంలో అనేక స్విమ్మింగ్ పూల్స్, జిమ్‌లు, టెన్నిస్ కోర్టులు గత ఐదేళ్లలోనే ఎక్కువగా ప్రారంభమయ్యాయి. టీడీపీ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లో కనీసం తట్టెడు మట్టి కూడా స్టేడియంలో పోయకపోవడం శోచనీయం.

స్టేడియంలు, కోచ్‌లు ఉండాలి

ప్రస్తుతం క్రికెట్, ఫుట్‌బాల్, హాకీలాంటి క్రీడా సాధనకు స్టేడియంలు లేవు. ఉన్నవాటిని ప్రభుత్వం నిర్లక్ష్యంగా వదిలేసింది. ఎన్టీఆర్, బీఆర్ స్టేడియంలలో సుమారు 35 క్రీడా శిక్షకులు ఉన్నారు. వీరంతా కేవలం 13 నుంచి 20 వేల మధ్య జీతాలతో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్నారు. వీరిని పట్టించుకునే నాథుడే లేడు. అయితే, అప్పటి జగన్ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల్లో ఐదు శాతం క్రీడా కోటా భర్తీ చేయడంతో జిల్లాలో కొందరికి ప్రభుత్వ కొలువులు వచ్చాయి.

ధ్యాన్‌చంద్ జీవిత విశేషాలు

ఆగస్ట్ 29, 1905లో అలహాబాద్‌లో జన్మించారు. 1928, 1932, 1936 హాకీ ఒలింపిక్స్‌లో భారత్ వరసుగా బంగారు పతకాలు సాధించింది. ఆ ఘనత ధ్యాన్ చంద్‌కే దక్కుతుంది. 1932లో ఒలింపిక్స్‌లో భారత్ అమెరికాను 24–1 గోల్స్‌తో ఓడించింది. ఇప్పటి వరకు ఒలింపిక్స్‌లో ఇదే అత్యంత మార్జిన్ విజయం. ఆయన క్రీడా జీవితంలో 1926–1949 కాలంలో మొత్తం 185 మ్యాచ్‌లలో 570 గోల్స్ చేశారు. 1956లో మేజర్ స్థాయిలో పదవీ విరమణ చేశారు. అదే ఏడాది భారత ప్రభుత్వం ఆయనను 'పద్మభూషణ్' అవార్డుతో సత్కరించింది. ధ్యాన్‌చంద్‌కు పర్యాయ పదాలు కూడా ఉన్నాయి. 'విజార్డ్, మెజీషియన్ '.

క్రీడలపై రాజకీయాలెందుకు?



క్రీడలు నిత్యం జీవితంలో ఒక భాగం. ఏ ప్రభుత్వం ఉన్నా రాజకీయాలతో మిళితం చేయకూడదు. నేను ఎన్టీఆర్ స్టేడియాన్ని కేవలం క్రీడాస్ఫూర్తితోనే అభివృద్ధి చేశా. స్టేడియం సిబ్బంది, సభ్యులు ఎంతో సహకరించారు. అందుకే నేడు స్టేడియం క్రీడాకారులతో కళకళలాడుతోంది. క్రీడల అభివృద్ధికి ఏ సమయంలోనైనా నా సహకారముంటుంది. చక్కని ఆరోగ్యం కోసం క్రీడలు ఎంతో దోహదపడతాయి. పిల్లలకు పాఠశాల స్థాయి నుంచే క్రీడా సాధన మొదలవ్వాలి. గత ప్రభుత్వం నాడు-నేడు పథకంలో భాగంగా పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్దడమే కాకుండా చక్కని క్రీడా మైదానాలు కూడా ఏర్పాటు చేసింది. క్రీడల్ని రాజకీయం చేయకూడదని నా అభిప్రాయం.

–లేళ్ల అప్పిరెడ్డి, శాసన మండలి సభ్యుడు.

స్టేడియాన్ని చూస్తే బాధగా ఉంది



50 ఏళ్లకు పైగా బీఆర్ స్టేడియంతో నాకు అనుబంధముంది. 1989లో పరుగులు రాణి పీటీ ఉషతోపాటు ఎందరో అంతర్జాతీయ అథ్లెట్స్‌ను ఈ స్టేడియానికి తీసుకువచ్చి ఆడించాను. క్రికెట్ స్టేడియంతోపాటు ఇతర క్రీడలకు సదుపాయాలు కల్పిస్తామని ఎనిమిది నెలల క్రితం పనులు ప్రారంభించారు. గత మూడు నెలల నుంచి పనులు ఆగిపోయాయి. పార్టీలు ఏవున్నా క్రీడాభివృద్ధికి దోహదపడాలని మనవి.

–జి.శేషయ్య, చైర్మన్ జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్

డీపీఆర్‌లు సిద్ధమవుతున్నాయి



బీఆర్ స్టేడియం అభివృద్ధి కోసం డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నాం. రాష్ట్రానికే ఈ స్టేడియం తలమానికం. నిత్యం సుమారు ఎనిమిది వేల మంది వాకర్స్‌తోపాటు చిన్నారులు వస్తుంటారు. గత ప్రభుత్వం స్టేడియం అభివృద్ధిలో భాగంగా క్రికెట్, ఇతర క్రీడలకు సదుపాయాల కల్పనకు పనులు ప్రారంభించింది. కొన్ని నెలలుగా అవి ఆగిపోయాయి.

–నరసింహారెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి.

అసోసియేషన్లు పోటీలు నిర్వహించాలి



హరియాణా చాలా చిన్న రాష్ట్రం. జాతీయ పతకాలు సగానికి పైగా ఆ రాష్ట్రానికే వస్తుంటాయి. క్రీడా పాలసీలో భాగంగా క్రీడల్ని అభివృద్ధి చేస్తే ఆరోగ్యం సమాజ స్థాపనకు ఉపయోగపడుతుంది. జిల్లాలో ఒలింపిక్ అసోసియేషన్ కింద 41 క్రీడా సంఘాలున్నాయి. వాటిలో 10 నుంచి 15 అసోసియేషన్లు మాత్రమే పోటీలు నిర్వహిస్తున్నాయి. మిగతావి అలంకార ప్రాయంగా ఉంటున్నాయి. ప్రతి సంవత్సరం సబ్ జూనియర్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో పోటీలు నిర్వహించాలి.

–కొనసా వేణుగోపాల్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి

మద్యం మత్తుకు నిండు ప్రాణం బలి

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు మరియదాసు

జె.పంగులూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలోని ఫ్లై ఓవర్‌పై మంగళవారం రాత్రి జరిగింది. ఈ ప్రమాదంలో బల్లికురవ మండలంలోని కొణిదెన గ్రామానికి చెందిన జనరాజు పల్లి మరియదాసు (30) మరణించాడు. రేణింగవరం ఎస్ఐ బి.వినోద్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. జనరాజుపల్లి మరియదాసు, జనరాజుపల్లి నవీన్‌లు పూటుగా మద్యం సేవించి మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై బైక్‌పై మార్టూరు నుంచి ఒంగోలు వైపు వెళుతున్నారు. ఫ్లై ఓవర్ మీదుగా వెళుతుండగా ముందు వెళుతున్న వాహనాన్ని క్రాస్ చేయబోయి, అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం మరియదాసు రెండు కాళ్ల మీదుగా వెళ్లింది. 108 సిబ్బంది క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మరియదాసు మృతిచెందాడు. నవీన్‌కు గాయాలయ్యాయి. రేణింగవరం ఎస్ఐ వినోద్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమల్లో ప్రమాదాల కట్టడికి చర్యలు

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాలు నివారించేందుకు అత్యధిక ప్రాధాన్యంతో భద్రత ప్రమాణాలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అధికారులు, పరిశ్రమల యజమానులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాద కేటగిరిలో 22 పరిశ్రమలు ఉన్నట్లు ఇటీవల నిర్వహించిన సేఫ్టీ సోషల్ ఆడిట్‌లో బయట పడిందని వెల్లడించారు. బాయిలర్, విద్యుత్, ఫ్యాక్టరీస్, అగ్నిమాపక శాఖ తదితర అంశాల్లో లోపాలు ఉన్నట్లు గుర్తించారన్నారు. ప్రమాద జోన్‌లో ఉన్న పరిశ్రమల యజమానులు నిర్దిష్ట ప్రణాళికతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా రసాయనాలు నిల్వ ఉంచే అంశాల్లో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్మికులకు మౌలిక సదుపాయాల కల్పనతోపాటు, ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రమాద స్థాయిలో ఉన్న పరిశ్రమల్లో కార్మికులు వ్యక్తిగత భద్రతా కిట్‌లు అందజేయాలని సూచించారు. పరిశ్రమల్లో అంతర్గత సేఫ్టీ కమిటీలను ఏర్పాటుచేసి భద్రతా చర్యలు పర్యవేక్షించాలని వివరించారు. కార్మికుల్లో సేఫ్టీ కల్చర్ అలవర్చుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. పరిశ్రమల నిర్వహణలో ఏర్పడే ఇబ్బందులను ముందుగానే అధికారుల దృష్టికి తీసుకు రావాలని తెలిపారు. పరిశ్రమల యజమానుల నిర్లక్ష్యంతో కార్మికులకు ఎలాంటి ఇబ్బంది కలిగించినా, ప్రమాదం ఏర్పడినా కఠిన చర్యలకు వెనుకాడమని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో ఇండస్ట్రీస్ జీఎం ఆర్.వెంకట్రావు, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి, డెప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఎం.వి.శివకుమార్‌రెడ్డి, పరిశ్రమల శాఖ డీడీ సుధాకర్ పాల్గొన్నారు.

మెస్, కాస్మోటిక్ చార్జీలు విడుదల చేయాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు డిమాండ్



జిల్లా కలెక్టరేట్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్ష

లక్ష్మీపురం: సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టిన దీక్ష నుద్దేశించి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గ్రహాల్లో చదువుతున్న పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు 2023 నవంబర్ నుంచి మెస్, కాస్మోటిక్ చార్జీలను విడుదల చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ జిల్లాకు దాదాపు పది కోట్ల రూపాయలు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెండింగ్లో ఉన్నాయని వివరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నూనె పవన్ తేజ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షులు షేక్ కరీం, ఉపాధ్యక్షులు తిరుమలరావు పాల్గొని దీక్షకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, కిరణ్, నవ్యశ్రీ, శివా, అభి, దుర్గా సాయి, అజయ్, వెంకట్, రాహుల్, డేవిడ్, అమర్నాథ్, గణేష్, విక్రమ్, కిరణ్, గౌతమ్, సుభాని, దేవరాజు పాల్గొన్నారు.

కౌలు రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న హరిబాబు

సత్తెనపల్లి: కౌలు రైతుల సమస్యల పరిష్కారానికి నూతన చట్టం చేయాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హరిబాబు అన్నారు. సెప్టెంబర్ 5న విజయవాడలో నిర్వహించనున్న కౌలు రైతు సంఘం రాష్ట్ర సదస్సుకు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో బుధవారం జరిగిన సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంఘం నాయకుడు టి. హనుమంతరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ.. కౌలు చట్టంలో లోపాలను గుర్తించాలని, అందరికీ కార్డులు ఇచ్చేలా కొత్త చట్టం రూపొందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి వై. రాధాకృష్ణ మాట్లాడుతూ.. జిల్లాలో కౌలు కార్డుదారులందరికీ పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు ఉద్యమంపై బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ వ్యాఖ్యలను సమావేశం ఖండించింది. సమావేశంలో సంఘం నాయకులు జి.పిచ్చారావు, పి.మహేష్, అమర లింగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, తాతారావు, రైతు సంఘం నాయకులు ఎం. నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లగడపాడులో ఉద్రిక్తత

- ఇరు వర్గాల పరస్పర దాడులు
- పోలీసు పికెట్ ఏర్పాటు



సంఘటనపై విచారిస్తున్న డీఎస్పీ గురునాథ్ బాబు

పెదకూరపాడు: పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలం లగడపాడు గ్రామంలో ఉద్రిక్తత నెలకొంది. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో మినరల్ వాటర్ ప్లాంట్ వద్ద ఇరువురు మధ్య జరిగిన వివాదం పెద్ద దుమారం రేపింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ జానీ, హసన్ బాజి ద్విచక్ర వాహనాలపై మినరల్ వాటర్ పట్టుకునేందుకు ప్లాంట్ వద్దకు వచ్చారు. గతంలో వారికి విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో బాజి వాహనానికి జానీ బైకు అడ్డుపెట్టారని స్వల్ప గొడవ చోటుచేసుకుంది. పరస్పరం దాడి చేసుకున్నారు. గమనించిన స్థానిక పెద్దలు సర్దిచెప్పి వారిని పంపించారు. ఇంటికి వెళ్లిన తర్వాత బాజి వర్గీయులు జానీపై దాడికి పాల్పడ్డారు. అనంతరం జానీ వర్గీయులు కూడా బాజి సంబంధికులపై రాళ్ల దాడి చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ బాలూ నాయక్ తెలిపారు. సంఘటన స్థలాన్ని సత్తెనపల్లి డీఎస్పీ గురునాథ్ బాబు పరిశీలించారు. గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు.

266 పరుగులు సాధించిన కృష్ణా జట్టు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న సెంట్రల్ జోన్ అండర్–23 క్రికెట్ పోటీలలో భాగంగా బుధవారం కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కృష్ణా జట్టు తన తొలి ఇన్నింగ్స్‌లో తొలిరోజు ఆట ముగిసే సమయానికి 5 వికెట్ల నష్టానికి 266 పరుగులు చేసింది. జట్టులోని అనంత్‌కార్తికేయ 106 బంతుల్లో 10 ఫోర్లతో 61 పరుగులు సాధించాడు. సుశాంత్‌నాయుడు 165 బంతుల్లో 15 ఫోర్లతో 86 పరుగులతో క్రీజ్‌లో నిలిచాడు. పశ్చిమ గోదావరి బౌలర్ దీపక్‌చంద్‌కు 2 వికెట్లు లభించాయి. గురువారం రెండవ రోజు ఆట కొనసాగనుంది. మ్యాచ్‌ను గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాడేపల్లిరూరల్: కృష్ణాకెనాల్ రైల్వే జంక్షన్ నుంచి మంగళగిరి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలో శర్మ దాబా సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ట్రెన్‌లో నుంచి కిందపడి మృతి చెందిన ఘటనపై గుంటూరు జిల్లా రైల్వే పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ సీఐ అంజిబాబు మాట్లాడుతూ గుర్తుతెలియని రైలు నుంచి ఓ వ్యక్తి జారి కిందపడి మృతి చెందాడని, మృతుడు వయస్సు 35 సంవత్సరాలు ఉండవచ్చని, మృతుడు బ్రౌన్ కలర్ టీషర్ట్ ధరించి ఉన్నాడని, మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు వివరించారు. వివరాలకు 9440627546, 0863–2220753 నంబర్లను సంప్రదించాలని కోరారు.

హైవేపై చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

పెదకాకాని: జాతీయ రహదారిపై చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. గుంటూరు పట్టాభిపురం ఫాతిమా నగర్‌కు చెందిన కురిచేటి సుబ్రహ్మణ్యం కార్లకు ఆల్టింగ్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. చెడు అలవాట్లకు బానిసగా మారి ఈజీగా డబ్బులు సంపాదించాలని దురాశతో చోరీలకు పాల్పడటం ప్రారంభించాడు. జాతీయ రహదారిపై బైక్ నడుపుతూ ఒంటరిగా వెళ్లే వారిని, ఆ వ్యక్తి కూడా 50 సంవత్సరాలు వయస్సు పైన ఉన్న వారిని టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నాడు. ముందుగా ఒక పథకం ప్రకారం జాతీయ రహదారిపై వెళ్తున్న వారి బైకు తన బైక్ అడ్డుగా పెట్టి నా ఏటీఎం కార్డు కింద పడినప్పుడు తీసుకున్నావ్ అంటూ జేబులు చూపించమని డిమాండ్ చేస్తాడు. వారు బైక్ ఆపి జేబులు చూపించి ఏటీఎం కార్డు మేము తీసుకోలేదని చెప్పే క్రమంలో అతడి వద్ద ఉన్న నగదు గమనించి లాక్కొని బైక్ పై వెళ్లిపోతున్నాడు. ముఖానికి మాస్కు ధరించి పెదకాకాని పరిధిలో జాతీయ రహదారిపై 3 చోరీలకు పాల్పడ్డాడు. తక్కెలపాడు సమీపంలో జాతీయ రహదారిపై రెండు నెలల వ్యవధిలో ఒకరి వద్ద నాలుగు లక్షలు మరొకరి వద్ద లక్ష రూపాయలు కాజేసి పరారయ్యాడు. అలానే పెదకాకాని వెంగళరావు నగర్ సమీపంలో బైక్ పై వెళుతున్న వ్యక్తి వద్ద నుంచి రూ.6,700 లాక్కొని పరారీ అయ్యాడు. బాధితుల నుంచి ఫిర్యాదులు అందడంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులు వద్ద నుంచి రూ.56, 700 దొంగిలించినట్లు నిందితుడు కురిసేటి సుబ్రహ్మణ్యం అంగీకరించాడు. నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో బంగారపు ఉంగరం, విజయవాడ నగరంలో బంగారు గొలుసు చోరీ చేసినట్లు అంగీకరించాడని పోలీసులు తెలిపారు. నిందితుడ్ని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు పెదకాకాని సీఐ టి.నారాయణస్వామి తెలిపారు.

చెల్లని చెక్కు కేసులో నిందితులకు జైలు

మంగళగిరి: చెల్లని చెక్కు కేసులో ముద్దాయికి జైలు శిక్ష పడింది. బుధవారం కోర్టు వెలువరించిన తీర్పు వివరాలు.. పట్టణంలోని కొండపనేని టవర్స్‌లో నివాసముంటున్న నాగళ్ల రవీంద్రబాబు అనే రైతు భట్టిప్రోలుకు చెందిన అక్షయ ఫెర్టిలైజర్స్ నిర్వాహకుడు మాదల ప్రవీణబాబు వ్యాపారం నిమిత్తం 1830 కిలోల మొక్కజొన్నలు రూ.6,10,400లకు కొనుగోలు చేశారు. అనంతరం పార్ట్ పేమెంట్ కింద రూ.5.80 లక్షలకు చెక్కు ఇవ్వగా సదరు చెక్కులను ఫిర్యాది రవీంద్రబాబు మంగళగిరిలోని ఐసీఐసీఐ బ్యాంకులో జమ చేయగా చెక్కు బౌన్స్ అయింది. అనంతరం రవీంద్రబాబు కోర్టులో ప్రవీణ్‌బాబుపై కేసు వేయగా వాదోపవాదాల అనంతరం జడ్జి సురేష్‌బాబు నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు బాధితుడికి రూ.5.80 లక్షలు కాంపనేషన్ చెల్లించాలని తీర్పు వెలువరించారు. అదే విధంగా నూతక్కి గ్రామానికి చెందిన అవుతు శ్రీనివాస్‌రెడ్డి నుంచి బి.అరుణారెడ్డి రూ.3 లక్షలు తీసుకుని ఆ మొత్తానికి చెక్కు ఇవ్వగా నూతక్కి బ్యాంక్‌లో జమ చేయగా చెక్కు బౌన్స్ అయింది. ఫిర్యాది శ్రీనివాస్‌రెడ్డి మంగళగిరి కోర్టులో కేసు వేయగా అరుణారెడ్డికి ఆరు నెలలు జైలు శిక్షతో పాటు రూ.3 లక్షల కాంపనేషన్ చెల్లించాలని జడ్జి సురేష్‌బాబు తీర్పు వెలువరించారు.